# ఫలించిన కోరిక

రచన : శ్రీ అత్తివిల్లి బాలసుబ్రహ్మణ్యం

"నాన్నా..." పిలిచింది సుశీల.

"ఊఁ..." రంగనాథం పలికాడు. ఆ కంఠంలో ఆవేదన ప్రస్ఫుట మౌతోంది. నిరాశా, నిస్పృహాలతో నిండిన పలుకది.

'రేపే, నాన్నా! ఆఖరిరోజు! కాలేజీ ఫీజు కట్టక పోతే...' సుశీల కంఠం ఆర్ద్రమైంది. దుఃఖభారంతో ఆమె గొంతు పూడిపోయింది.

రంగనాథానికి తెలుసు, కాలేజీ ఫీజు కట్టకపోతే ఏమౌతుందో...! కాని... దానికి, డబ్బో...? తను తెచ్చిన వెధవ ఎనభైరూపాయలు అప్పులు చెల్లించేందుకే చాలవు. రాబడికి మించిన ఖర్చు. ఏం చేస్తాడు? ప్రతీ నెలా సుశీల, జీతంకోసం తనని దీనంగా అడగడం, తను మొండిచెయ్యి చూపడం! తర్వాత ఎవరిదగ్గరో అప్పుచేసి ఇవ్వడం! కాని, ఈనెల తనకు అప్పుకూడా పుట్టదు. నిన్ననే అద్దె చెల్లించలేదని ఇంటాయన నానా మాటలూ అని వెళ్లాడు. ఇక పాలవాడు, కూరలవాడు సరేసరి! ఇవీ తన ఆర్థిక పరిస్థితులు......

అయినా, 'అలాగేనమ్మా! చూద్దాంలే' అన్నాడు పైకి గంభీరంగా. అన్నాడేగాని ఎలా సంపాదించడ మాని లోపల పీకుతూనే వుంది.

సుశీలకు తెలుసు తండ్రి మనసు! పాపం! తల్లి మరణించిన దగ్గరనుండీ తననల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేశాడు. వృద్ధాప్యంలో కూడా విశ్రాంతి అనేది లేకుండా తన చదువు పూర్తికావడముకోసం ఉద్యోగం చేస్తున్నాడు. తనకోసం, తన అభివృద్ధికోసం - తండ్రి అనుభవించే బాధలు ఎదుర్కొనే కష్టాలు-అన్నీ తనకు తెల్సు, కాని ఏం చెయ్యగలదు?...అందుకే తనెన్నో సార్లు చెప్పింది-'నేను మరి చదవను, నాన్నా నాకోసం ఎందుకిన్ని బాధలనుభవిస్తావ్? నిన్ను కష్టాలపాలు జేస్తూ నేనా 'డాక్టరీ'చదవకపోతే వచ్చిన నష్టమేమిటి? నేను కూడా ఏదో ఉద్యోగంలో చేర్తాను—' అని. కాని వింటేగా? 'అది కోరిన ఆఖరి కోర్కైనా తీర్చని సమర్థున్నెందుకు చేస్తావమ్మా? నీవు, డాక్టరువైతే దాని ఆత్మ శాంతిల్లుతుంది! దాని కోరిక కూడా తీరుతుంది. నా ఆశయం నెరవేరుతుంది! తర్వాత నేను సంతోషంగా ప్రాణాలు...' 'ఉష్! ఊర్కో, నాన్నా!' అని సుశీల అతన్ని వారిస్తుంది. 'దిన దిన గండం...' లా తమ జీవితం సాగుతూంది.

'వెళ్ళి చదువుకో అమ్మా!' తండ్రి హెచ్చరికతో ఆలోచనలనుండి తేరుకొంది - సుశీల. తన గదిలోకి వెళ్ళిపోయింది- గాఢంగా నిట్టూరుస్తూ.

రంగనాథం ఆమె వెళ్ళిన వంకే జూస్తూ. 'నా బంగారు తల్లి! తల్లి పోలికలన్నీ పుణికిపుచ్చుకుంది! అదే బ్రతికి వుంటే...' అనుకొన్నాడు. రంగనాథానికి గతస్మృతులు ఒక్కొక్కటే మనోపథంలోకి రాసాగాయి..

× × ×

రంగనాథం తండ్రి విశ్వనాథం కాకినాడలో పేరు మోసిన లాయరు! తన వాక్చాతుర్యంతో ఎదుటి పార్టీని గెలిచి ఎందరు అభాగ్యులనో కాపాడేడాయన! ఆయన భార్య అనసూయమ్మ - భర్తకు తగిన ఇల్లాలు! వారికి లేక లేక కలిగిన సంతానమే-రంగనాథం! విశ్వనాథానికి రంగనాథాన్నొక ఆరితేరిన వకీలుగా తయారు చేయాలని ఆశవుండేది! అందుకే ఆయన రంగనాథాన్ని 'లా' చదివించడము మొదలెట్టేరు. ఆరోజుల్లో రంగనాథానికి అనేక సంబంధాలు రాసాగాయి. అయితే రంగనాథానికి ఎవరూ నచ్చలేదు! ఇలా వుండగా - అకస్మాత్తుగా రంగనాథానికి నచ్చిన అమ్మాయి కనబడింది-ఒక పెళ్ళి చూపులో! ఆమే సుభద్ర! తల్లిదండ్రులు బీదవారగుటచేత కట్నమివ్వడానికి తాహతులేకపోయింది. అందుచేత విశ్వనాథం ఆ సంబంధాన్ని విడిచిపెట్ట బోయాడు. కాని, రంగనాథం ససేమిరా ఒప్పుకోలేదు, 'నేనా అమ్మాయిని తప్ప ఇతరులను చేసుకోను' అంటూ మొండి పట్టుపట్టాడు. విశ్వనాథం ఎన్నోవిధాలుగా చెప్పి చూశాడు. కాని ఫలితం లేకపోయింది. దాంతో విశ్వనాథం ఉగ్రుడయ్యాడు. రంగనాథం తండ్రితో సంబంధాన్నైనా త్రెంపుకో చూశాడుగాని, సుభద్రతో వివాహం మాత్రం మానలేదు! అంతే! విశ్వనాథం రంగనాథం విషయం ఎత్తితే ఉగ్రుడవసాగాడు.

రంగనాథం, సుభద్రతో వేరే ఇంట్లో కాపురం పెట్టాడు. ఏదో చిన్న వుద్యోగం చేసుకుంటూ కాలం గడుపసాగేడు. సుభద్ర-తల్లిదండ్రులతో కూడా సంబంధం వదులుకొని తన్ను పెళ్ళాడిన రంగనాథాన్ని అమితంగా గౌరవిస్తూ, ప్రేమిస్తూండేది. ఇలా వుండగా రంగనాథం తల్లి, కొడుకుకోసం బెంగ పెట్టుకొని మంచమెక్కింది. అయినా విశ్వనాథం తన పంతం విడువలేదు. ఫలితం! అనసూయమ్మ గుండె జబ్బుతో మరణించింది! రంగనాథం బోరుమంటూ తల్లిని చూడ్డానికి వచ్చాడు. అయిననూ విశ్వనాదం అతన్ని కనికరించలేదు. నానాదుర్భాషలూ ఆడి వెళ్ళగొట్టాడు. రంగనాథం హృదయ వేదనను అణచుకోలేక సుభద్రతో చెప్పిభోరున ఏడ్చాడు. తన ప్రేమానురాగాలతో అతన్ని యూరడించింది-సుభద్ర.

కాని, విశ్వనాథం ఎంతో కాలం బ్రతుక లేదు! భార్య మరణించిన దుఃఖంతో అతను అనిమిషము చింతాక్రాంతుడై ఒకనాడకస్మాత్తుగా హృద్రోగంతో మరణించాడు. రంగనాథం తండ్రి మరణాని కమితంగా దుఃఖించాడు. కాని తండ్రి తనను చనిపోయేటంతవరకు ద్వేషించడం అతడు మరువలేదు, అందుకనే అతడు తండ్రి ఆస్థిపాస్తుల్ని ధర్మ పంస్థలకు విరాళాలుగా ఇచ్చి, ఆ ఊర్లో వుంటే అనుక్షణమూ బాధపడాల్సి వుంటుందని మద్రాసు చేరేడు.

× × ×

కాలచక్రంలో కొన్ని సంవత్సరాలు గతించాయి. సుభద్ర గర్భవతి అయింది. ఆ వార్త విన్న రంగనాథం ఆనందానికి పట్టపగ్గాలు లేకపోయాయి. ఇన్నాళ్ళకు తమ లోక ప్రేమఫలం లభిస్తుందని!

నెలలు గతించాయి, సుభద్ర నవమాసాలు నిండుగనే ఒక కుమార్తెను కన్నది. ఆ బాలికను చూచిన వారి ఆనందానికి అంతులేకపోయింది. ఆమెకు 'సుశీల' అని నామకరణం చేశారు. సుశీల పెరిగి ఐదేళ్ళదయింది.

ఒకనాడు వున్నట్టుండి సుభద్ర 'భళుక్కు'న పెద్ద వాంతి చేసుకొంది. రంగనాథం భయపడిపోయాడు ఇంతలో ఆమె మరో రెండు వాంతులు చేసుకుంది రంగనాథం వెంటనే ఆమెను గవర్నమెంట్ ఆస్పత్రిలో చేర్చాడు. కాని సుభద్రకి ఈ లోకంతో ఋణం చెల్లిపోయింది. చనిపోయే ముందు ఆమె భర్తని పిలిచి, 'ఏమండీ... నా... కో... సం ... అష్టకష్టా...లు అ...నుభవించారు...అబ్బా! ఇది నా ఆఖరు...కో...రిక... తీరుస్తా...రు...కదూ...సుశీల ను...డాక్ట...రు...చ...ది...విం...చం...'

అంతే ఆమె ప్రాణవాయువులు అనంతవాయువుల్లో లీనమయ్యాయి. రంగనాథం 'సుభద్రా' అని ఆస్పత్రి మార్మోగేటట్టు పెద్ద కేక వేసి, ఆమె భౌతికకాయంపై వాలిపోయాడు!

రంగనాథం కంటివెంట అపారంగా కన్నీరు కారసాగింది. 'సుభద్ర! అమృతమూర్తి...' అనుకుంటూ పూర్వ స్మృతులతో వ్యాకుల పడసాగాడు. కొంతసేపటికి తేరుకొన్నాడు. 'ఆఁ! ప్రస్తుత కర్తవ్యం? రేపే ఆఖరు రోజంటే-సుశీల! కాని...

అరుణభానుని ఉదయ కిరణాలు కిటికీల గుండా ప్రసరించి ప్రశాంతముగా నిద్రిస్తున్న సుశీను 'చురుక్'మనిపించాయ్! వుంటనే లేచి కూర్చుంది-సుశీల! 'అబ్బా! అప్పుడే చాలా ప్రొద్దెక్కిందే!' అంటూ మంచం దిగింది. అంతే! తన టేబుల్ మీద కన్పించిన కాగితము అది ఎగిరిపోకుండా వుంచిన పేపర్ వెయిటూ జూచి నిర్ఘాంత పోయింది. వెంటనే టేబిల్ దగ్గరకు నడచి ఆ కాగితాన్నందుకొంది: అందులో.

'అమ్మా, సుశీలా!

దరిద్రదేవత తన కరాళహస్తాలతో మనల్ని బంధించింది. ఆ కరాళ హస్తాల్ని మనం మంచిగా వున్నంత కాలం విదిలిపించుకోలేము. దానికి చెడే సరైన సాధనం! అందుకని దాన్నే నేను అవలంభించాను. నిన్న రాత్రల్లా ఆలోచించి ఈ నిర్ణయానికొచ్చాను. నేను వున్నన్నాళ్ళు నీ కష్టాలు తీరవు. నా జాతకమే అలాటిది. దారిద్ర్యంలోనే మీ అమ్మ కళ్ళు మూసింది. నేను నీ జీవితాన్నుండి అదృశ్యమైతే నీ కష్టాలు తీరితే నాకదే పదివేలు! చక్కగా చదువుకొని, డాక్టరు వౌతావని ఆశిస్తాను. డ్రాయర్‌లో కొంత డబ్బుంది! ఆ డబ్బుతో కాలేజి ఫీజు కట్టు, ఏ పరిస్థితుల్లోనూ నీ చదువు ఆపకు. ఇవే నీకు నా చివరి ఆశిస్సులు. అసమర్థుడైన నీ తండ్రిని చూసి నవ్వుతావ్ కదూ!

—'రంగనాథం.'

'నాన్నా! ఏమిటి నాన్నా, ఇది? నా చదువుకోసం ప్రాణత్యాగం చేస్తున్నావా??? ఈ పాపిష్టురాలు పుట్టుకతో తల్లిని పోగొట్టుంది. ఇప్పుడు తండ్రిని కూడానా? అంటూ కన్నీరు మున్నీరుగా విలపించింది అమాయక, సుశీల!

× × ×

యాంత్రికంగా కాలేజీ కెళ్ళి వస్తూంది సుశీల. లోకంతో తనకేమీ సంబంధం లేనట్టూ, ఒక్క-చదువే ముఖ్య కర్తవ్య మన్నట్టూ-ఆమె సంచరిస్తోంది. ఆమె జీవితములో సుఖశాంతులేనాడో కరవయ్యాయి. జీవచ్ఛవంలా గడుపుతూంది.

ఒకనాడు...యథాప్రకారంగా సుశీల కాలేజీ నుండి వస్తోంది. ఇంతలో, 'మీ బైయాలజీ నోట్సు వొక మారిస్తారా, మేడం?' అన్న కంఠస్వరం విని సుశీల తలపైకెత్తి చూసింది.

అది కాలేజి ఆవరణ. అప్పుడు బైయాలజీ క్లాసయింది. తనని నోట్సడిగిన యువకుని తేరిపారి చూసింది.

'క్షమించండి. నా పేరు రఘురాం!' అన్నాడా యువకుడు తొట్రుపడుతూ. ఆ యువకుడు స్ఫురద్రూపి. షార్కుస్కిన్ ప్యాంట్ మీద టెర్లిన్ 'టకప్' చేశాడు. అతని గజిబిజిగానున్న శిరోజాలు అతనిఫాల భాగముపై పడుతూ అతనికొక వింత సౌందర్యాన్ని ప్రసాదిస్తున్నాయ్. చాల సంస్కారం, సభ్యతా గల యువకుడు-రఘురాం.

అతనికి బైయాలజీ బుక్ 'హేండోవర్' చేసింది-సుశీల.

దాన్నందుకొని, 'థాంక్యూ వెరీ మచ్' అన్నాడా యువకుడు-రఘురాం, సభ్యతగా.

'నెవర్ మైండ్' అంటూ సుశీల సాగిపోయింది.

ఆ మరుసటిరోజు రఘురాం ఆ పుస్తకాన్ని సుశీలకు 'రిటన్' చేశాడు.

* * *

మెరీనా బీచ్ జనంతో కిటకిటలాడ్తోంది. పిల్లలు గోలగా ఇసకలో ఆడుకొంటున్నారు. జంటలుగా యువతీ యువకులు వస్తూ పోతున్నారు; కబుర్లు చెప్పుకుంటున్నారు.

రఘురాం అలలతో విజృంభిస్తూన్న సముద్ర సౌందర్యాన్ని చూస్తూ నడుస్తున్నాడు. అకస్మాత్తుగా ఇసుకలో కూర్చొనియున్న ఒక స్త్రీమూర్తిని చూసి ఆత డాగి పోయాడు. ఆమె మరెవరో కాదు-సుశీల!

'సుసీలగారూ...' రఘురాం మెల్లగా పిలిచాడు.

సుశీల ఉలిక్కిపడి తలెత్తి చూసింది. ఆమె కనుదోయిలో లీలగా అశ్రువులు రఘురాం కళ్లబడ్డాయి.

'వాటీస్ దిస్? యూ ఆర్ వీపింగ్? వాటీస్ది మాటర్?' అన్నాడు రఘురాం-అంటూ ఆమెను సమీపించాడు.

'లేదండీ, ఆ' అంటూ తప్పుకో జూసింది. సుశీల గారూ! కష్టాలున్నప్పుడు ఆత్మీయులతో చెప్పుకుంటే హృదయం తేలికౌతుందన్నమాట మీరు విన్నారా?'

సుశీల ఆశ్చర్యానుమానాలతో రఘురామ్ని చూసింది. 'ఈతడు తనకు ఆత్మీయుడా?' అని మనసులో కలపోసింది.

'సందేహించకండి, సుశీలగారూ?'

సుశీల కరగిపోయింది. ఇన్నాళ్ళకు తన హృదయావేదనను వినే వ్యక్తి దొరికినందుకు మురిసి పోయింది. ఆమె హృదయం ఆనందంతో గంతులువేసింది. తన దీనగాథని రఘురాంకి నివేదించింది.

అంతా విని నిట్టూర్చాడు రఘురాం. 'కొందరి జీవితాలు కష్టాలతోనే ప్రారంభమై, కష్టాలతోనే అంతమౌతుంటాయి. మీవంటి సుగుణశీలకు, విద్యావతికి దారిద్ర్యం నిజమే! లక్ష్మీ సరస్వతు లెన్నడూ ఒకచోటుండరు కదా! మీరు కాదనకుంటే నేను మీకు సహాయపడతాను. మీ తల్లికోరిక ప్రకారం డాక్టరు చదవండి. ఏదో దేవుని దయవల్ల నాకు డబ్బుకు లోటు లేదు నాకు తల్లిదండ్రులు చిన్నప్పుడే పోయారు...'

'మౌనం అర్ధాంగీకారం' అనుకొన్నాడు రఘురాం.

× × ×

కాలచక్ర పరిభ్రమణంలో మరి కొన్నేళ్ళు గడిచాయి. సుశీల రఘురాం ప్రోత్సాహంతో, సహాయంతో M. B., B. S., పాసయి 'ప్రైవేటు డాక్టరు'గా ప్రాక్టీసు పెట్టింది. అయితే తన అభివృద్ధికి కారణమైన రఘురామ్ని ఆమె మరవలేదు. అతన్ని తన హృదయ

మందిరంలో ప్రతిష్ఠించుకొని పూజించసాగింది. రఘురాంకూడా ఆమె రూపగుణ లావణ్యాలను ఆరాధించి ఆమెను గాఢంగా ప్రేమించాడు. ఇద్దరూ ఒకరి మనస్సు ఒకరు తెలుసుకున్నారు. కొద్ది రోజుల్లో భార్యా భర్త అయ్యారు.

'లేడీ డాక్టర్ సుశీల' ఆ ప్రాంతం వారికి ఆరాధ్యదైవం. ఆమె మందివ్వకపోయినా తన అమృతహస్తంతో రోగి నొకసారి తాకితే చాలు-ఎక్కడి రోగం అక్కడే తగ్గిపోతుందన్న నమ్మకం ప్రజల్లో స్థిరపడిపోయింది.

సుశీల రోగుల్ని తన కన్నబిడ్డల్లా చూస్తోంది. 'ఫ్లారన్స్ నైటింగేల్' లా మానవసేవయే మాధవసేవ యని ఆమె నమ్మకం. ఆ నమ్మకంతోనే చిరాకు, చీదరింపులేక తనవద్ద కొచ్చిన రోగులనందరినీ ఆమె చికిత్స చేసి, పరిపూర్ణారోగ్యవంతులుగా చేస్తుంది. త్వరలోనే ఆమె కీర్తి, ప్రతిభ వ్యాపించింది.

× × ×

ఆ రోజు 'రమేష్' జన్మదినం. ఆరోజుతో రమేష్‌కి రెండోయేడు వస్తుంది. రమేష్ - రఘురాం, సుశీలల ప్రేమ ఫలం.

ఆడంబరంగా, వైభవంగా జరిగింది రమేష్ జన్మదినం ఆహుతులందరూ రమేష్‌ని దీవించి వెళ్ళిపోయారు. సుశీల, రఘురాం ఒకచోట చేరి రమేష్‌ను ముద్దాడుతున్నారు.

ఆ సమయంలో 'అమ్మా' అన్న పిలుపు వినిపించింది. రఘురాం వెళ్ళి ఆ విధంగా పిలిచిన వ్యక్తిని తీసుకొచ్చాడు. అతడొక వృద్ధుడు. గడ్డాలు, మీసాలు పెరిగిపోయి భీకరంగా నున్నాడు.

'నన్ను గుర్తుపట్టలేదా, సుశీలా! నేను, నీ తండ్రిని-ఆనాడు నిన్ను విడిచిపెట్టి పోయినాక ఆత్మహత్య చేసుకుందామనుకున్నాను-గాని ఆ ప్రయత్నం విరమించుకున్నాను. ఆసమయనిగా దేనికి చావడమని దేశాలన్నీ తిరిగి, నీ సంగతేమయిందోనని వచ్చానమ్మా...'

'మామగారూ!' అంటూ రఘురాం - 'నాన్నా!' అంటూ సుశీల అతన్ని చుట్టివేశారు.

వచ్చీరాని మాటలతో 'టాతా...' అన్నాడురమేష్. ఆ ఇంట్లో ఆనందం వెల్లివిరిసింది.


# కథాంజలి

(కథల మాస పత్రిక)

స్థాపితము 1938.

| | |
|---|---|
| విడి ప్రతి. | ... 25 పై. లు |
| సంవత్సర చందా. | ... రూ. 4-00 |

(ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్ బాథమ్స్, మరియు స్వదేశమిత్ర బుక్ స్టాల్సులలోను దొరుకుతుంది.


